క్లుప్తంగా

పక్కా ఇళ్ల మంజూరుకు వినతి



పీడీ రమణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న వెంకటరావు

విజయనగరం పూల్‌బాగ్: అర్హులైన నిరుపేదలందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గదులు వెంకటరావు కోరారు. స్థానిక గృహ నిర్మాణ సంస్థ జిల్లా కార్యాలయంలో పీడీ రమణమూర్తికి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎం.దుర్గారావు, ఎస్ఎస్ రెడ్డి, పి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

16న వేలం

నెల్లిమర్ల: మద్యం అక్రమ రవాణాలో పట్టుబడిన ఆటోను ఈ నెల 16వ తేదీన వేలం వేస్తున్నట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ జీఎస్.రాజశేఖర్ నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం అక్రమ రవాణలో సీజ్ చేసిన ఆటోను నెల్లిమర్ల పట్టణంలోని చంద్రబాబు కాలనీలో ఉన్న తమ స్టేషన్ వద్ద ఉదయం 10.30 గంటలకు ఏఈఎస్ ఆధ్వర్యంలో వేలం వేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని సీఐ సూచించారు.

25న రెడ్ క్రాస్ సోసైటీ సమావేశం

విజయనగరం ఫోర్ట్: ఇండియన్ రెడ్‌క్రాస్ సోసైటీ విజయనగరం జిల్లా శాఖ వార్షిక సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్నట్టు ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ కార్యదర్శి సత్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో కమిటీ అధ్యక్షుడు అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో మేనేజింగ్ కమిటీ సభ్యుల ఎంపిక పక్రియ కూడా ఉంటుందని తెలిపారు. జిల్లాలోని రెడ్‌క్రాస్ జీవిత కాల సభ్యులు, ప్యాట్రన్లు, వైస్ ప్యాట్రన్లు కమిటీ సభ్యులు ఐడీ కార్డులు ధరించి సమావేశానికి రావాలని సూచించారు.

కనకదుర్గమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



కనకదుర్గమ్మతల్లి అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

భోగాపురం: మండల కేంద్రంలోని శ్రీకనకదుర్గమ్మ తల్లి మారు జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు మంగళవారం భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు కొమ్మూరు సుభోషణరావు, పడాల భానుప్రకాశ్, రౌతు వాసు, కొమ్మూరు బుల్లయ్య తదితరులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

క్రీడాకారునికి సత్కారం



అపర్ణబాబును సన్మానిస్తున్న నేతలు

బొబ్బిలి: స్థానిక పట్టణంలో పట్టణానికి చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కోట అపర్ణబాబును మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు కలిసి మంగళవారం సత్కరించారు. ఇటీవల ప్రొద్దుటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నేపథ్యంలో ఆయనను సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని టోర్నీల్లో పాల్గొని, బొబ్బిలికి మంచి పేరు తీసుకురావాలని నేతలు ఆకాంక్షించారు. అనంతరం అపర్ణబాబుకు రూ.20 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ జేసీఎస్ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు(విసు), మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సుంకర సాయిరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ పండగ

బాడంగి: మండల కేంద్రంలో గంగమ్మ పండగ ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా యాదవుల కులానికి చెందిన నీలబోను కుటుంబ సభ్యులు ఈ పండగ చేయగా, ఆ కులానికి చెందిన వారంతా తమ కులదైవమైన గంగమ్మకు విశేష పూజలు చేస్తున్నారు. గొర్రెపోతును అమ్మవారికి బలి ఇచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం బంధుమిత్రులతో సహపంక్తి భోజనాలు చేస్తూ ఆనందంగా గడుపుతున్నారు. బుధవారంతో పండగ ముగుస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు.

గడువుకు ముందే..
రుణాల మంజూరు

ఈ ఫొటోలోని మహిళ పేరు తుమ్మగంటి లక్ష్మి. నెల్లిమర్ల మండలం సతివాడ గ్రామానికి చెందిన ఈమెకు రూ.75వేల స్త్రీనిధి రుణం మంజూరైంది. ఆ రుణంతో గ్రామంలోనే స్వీట్ షాపు ఏర్పాటు చేసుకుని, వ్యాపారం చేస్తున్నారు. తద్వారా ప్రతి నెలా కొంత ఆదాయం పొందుతున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన రుణం తనకు ఎంతగానో ఉపయోగపడిందని లక్ష్మి చెబుతున్నారు.





ఈ ఫొటోలోని మహిళ పేరు మక్కువ అమ్మాజమ్మ. నెల్లిమర్ల మండలం పెద బూరాడపేట గ్రామానికి చెందిన ఈమెకు ప్రభుత్వం రూ 1 లక్ష స్త్రీనిధి రుణం మంజూరు చేసింది. ఆ రుణంతో గ్రామంలోనే గేదెల పెంపకం ప్రారంభించారు. పాల వ్యాపారంతో ప్రతి నెలా కొంత ఆదాయం పొందుతున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన రుణం తన వ్యాపారాభివృద్ధికి ఉపయోగపడిందని అమ్మాజమ్మ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- నియోజకవర్గంలో 7756 మందికి స్త్రీనిధి రుణాలు
- ఈ ఏడాది రూ.33.5 కోట్లు అందజేసిన వైకేపీ అధికారులు

నెల్లిమర్ల: నియోజకవర్గంలో స్త్రీనిధి రుణాల మంజూరులో డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు ఈ ఏడాది గడువుకు ముందుగానే తమ లక్ష్యాన్ని అధిగమించారు. ఆర్థిక సంవత్సరం ఇంకా మిగిలి ఉండగానే 110 శాతం లక్ష్యాన్ని సాధించారు. నెల్లిమర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 7756 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇప్పటికే రూ 33.5 కోట్లు రుణాలుగా అందజేశారు. సదరు రుణాలతో మహిళలు స్వయం ఉపాధిని సాధిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే..

నెల్లిమర్ల నియోజకవర్గంలోని నెల్లిమర్ల, డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో మొత్తం 6600 స్వయం సహాయక సంఘాలున్నాయి. వీటిలో 74వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు స్త్రీనిధి రుణాలను విరివిగా మంజూరు చేస్తోంది. ఒక్కో సభ్యురాలికి రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు రుణాలను అందజేస్తోంది. ఆయా రుణాలతో మహిళలు వ్యాపారాలను, కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకుంటున్నారు. తద్వారా ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. డీఆర్‌డీఏ, వైకేపీ అధికారులు 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గడువుకు ముందే లక్ష్యాలను అధిగమించారు. మరికొద్ది రోజులు మిగిలి ఉండగానే నాలుగు మండలాల్లో సరాసరిన 110 శాతం లక్ష్యాలను సాధించారు. ఈ ఏడాది లక్ష్యం రూ.30 కోట్లు కాగా ఇప్పటికే 7756 మంది మహిళలకు రూ.33.5 కోట్లు రుణాలుగా అందజేశారు. నెల్లిమర్ల మండలంలో 1995 మందికి రూ 8.41 కోట్లు, పూసపాటిరేగ మండలంలో 2298 మందికి రూ. 9.82 కోట్లు, డెంకాడ మండలంలో 1851 మందికి రూ.7.31 కోట్లు, భోగాపురం మండలంలో 1612 మందికి రూ.7.68 కోట్లు రుణాలుగా మంజూరు చేశారు. నాలుగు మండలాల్లోనూ శతశాతం లక్ష్యాలను అధిగమించారు. రుణాలను తీసుకున్న నాలుగు మండలాలకు చెందిన మహిళలు కిరాణా షాపులు, టెంట్ హౌస్‌లు, జిరాక్స్ సెంటర్లు, పాడి పశువుల పెంపకం, టైలరింగ్ తదితర వ్యాపారాలను ప్రారంభించారు. తద్వారా స్వయం ఉపాధిని పొందుతున్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ప్రభుత్వం అందజేస్తున్న స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి. కొత్తగా వ్యాపారాలు, కుటీర పరిశ్రమలు ప్రారంభించాలనుకునే అందరికీ మంజూరు చేస్తాం. ఒక్కో మహిళకు రూ.1 లక్ష వరకు అందజేస్తాం. ఇప్పటికే దాదాపు అన్ని మండలాల్లోనూ శతశాతం లక్ష్యాలను సాధించాం.

– ఎ.కల్యాణచక్రవర్తి, పీడీ, డీఆర్‌డీఏ, విజయనగరం

వినోద్‌కుమార్ మృతి తీరని లోటు

- నివాళులర్పించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



డుబే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: మంచితనానికి, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన వైఎస్సార్‌సీపీ కంటోన్మెంట్ జోనల్ కోఆర్డినేటర్ వినోద్‌కుమార్ మృతి వ్యక్తిగతంగానే కాకుండా వైఎస్సార్‌సీపీకి తీరని లోటని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. పార్టీ జోనల్ కార్యాలయంలో దివంగత వినోద్ కుమార్ డుబే సంస్మరణ సభ మంగళవారం జరిగింది. ముందుగా వినోద్‌కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ చిరకాల మిత్రుడు, తన కుటుంబ సభ్యుడిగా ఉండే వినోద్‌కుమార్ అకాల మరణం ఊహించలేకపోయానని చెప్పారు. కంటోన్మెంట్ జోనల్ పరిధిలోని పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువ రానివన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతి దేవి, సీనియర్ న్యాయవాది కోలగట్ల తమన్న శెట్టి, విజయశంకర్ డుబె, తమ్ము, జోనల్ పరిధిలో ఉన్న కార్పొరేటర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చకచకా సీసీ రోడ్డు పనులు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని మల్లంపేటలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. మంగళవారం నిర్మాణ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఆయ న అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పార్వతి, రామారావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు

రూ.2.70 లక్షలకు పూజాసామగ్రి వేలం

రాజాం సిటీ:

స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ, జ్ఞానసరస్వతీదేవి ఆలయాల్లోని పూజాసామగ్రి విక్రయానికి వేలం ఖరారైందని ఈఓ పి.శ్యామలరావు తెలిపారు. మంగళవారం ఆలయ ఆవరణలో దేవదాయశాఖ తనిఖీదారు పీవీ లక్ష్మి సమక్షంలో నిర్వహించిన వేలంపాటలో ఏడుగురు పాటదారులు పాల్గొన్నారు. ఆలయం దగ్గర పూజాసామగ్రి సెట్లు, పుస్తకాలు, రక్షాబంధనములు, అమ్మవారి లామినేషన్ ఫొటోలు అమ్ముకునేందుకుగాను చేపట్టిన ఈ వేలంను సంతకవిటి మండలంలోని తలతంపర గ్రామానికి చెందిన రాగోలు ఆనందరావు ఏడాదికిగాను రూ.2.70 లక్షలకు దక్కించుకున్నారు. రెండో ఏడాది పది శాతం పెంపుపై అదే వ్యక్తికి ఉంటుందని ఈఓ తెలిపారు. మొత్తం ఈ నెల 30 నుంచి 2025 మార్చి 29వ తేదీ వరకు గడువు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.



నవదుర్గమ్మ ఆలయం

నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు

- వేసవిలో మహిళలకు ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు
- ఆంధ్ర, తోటపల్లి ప్రాజెక్టుల నుంచి చంపావతి నదిలోకి నీటి మళ్లింపు
- రానున్న నాలుగు నెలలు రోజు విడిచి రోజు నీటి సరఫరా
- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- పాలకవర్గ సభ్యులతో కలిసి రక్షిత మంచి నీటి పథకాల పరిశీలన



వాటర్ వర్క్స్ ప్రాంతాన్ని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: వేసవి నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి వెల్లడించారు. గత మూడు వేసవిల్లో నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామని, ఈ ఏడాది శివారు ప్రాంతాలకు చెందిన మహిళలు ఇబ్బందులు పడకుండా ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో గల చంపావతి నదీ తీరంలో ఉన్న విజయనగరం కార్పొరేషన్‌కు సంబంధించిన మంచి నీటి పథకాలను కార్పొరేషన్ పాలకవర్గ సభ్యులు, అధికారులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. చంపావతి నదిలో ఉన్న బావుల వద్ద ప్రస్తుతమున్న నీటి నిల్వలు, పంపింగ్ విధానం, జనరేటర్ పనితీరు తదితర అంశాలపై ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం కోరిక మేరకు ఇప్పటికే కలెక్టర్ ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించి ఆంధ్ర రిజర్వాయర్ నుంచి చంపావతి నదిలో నీటి మళ్లింపు ప్రక్రియ ప్రారంభించటం జరిగిందన్నారు. రానున్న ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల్లో నగర ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని, ఆంధ్ర రిజర్వాయర్‌లో నీటి నిల్వలు అడుగంటిపోతే తోటపల్లి నుంచి గడిగెడ్డ రిజర్వాయర్‌కు నీటిని మళ్లించి అక్కడి నుంచి చంపావతి నదిలోకి మళ్లించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించటం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పించే దిశగా ముందుకు వెళ్తున్నామన్నారు. గత పాలకుల్లా ఎన్నికలు వచ్చినపుడే ప్రజల కోసం ఆలోచించే వ్యక్తులం కాదని, ఎన్నికలు ఉన్నా లేకున్నా ప్రజల అవసరాలు తీర్చటం తమ బాధ్యతగా పని చేస్తున్నామన్నారు. తమ హయాంలో రూ.200 కుళాయి కనెక్షన్‌లు 2500 వరకు నూతనంగా మంజూరు చేయటం జరిగిందని, అర్హులైన వారందరికీ మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. త్వరలో అపార్ట్‌మెంట్‌లు, గ్రూపు హౌస్‌లకు కుళాయి కనెక్షన్‌లు మంజూరు చేస్తామని చెప్పారు. ఎక్కడైనా కుళాయి కనెక్షన్‌లు మంజూరు చేయకుంటే స్థానిక కార్పొరేటర్‌లను సంప్రదించాలన్నారు. ముషిడిపల్లి రక్షిత మంచి నీటి పథకం నుంచి నగరానికి నీటిని పంపింగ్ చేసే పైప్‌లైన్‌ల కాలపరిమితి ముగియటంతో లీకేజీల సమస్య తరుచూ వస్తుందన్నారు. నూతన పైప్‌లైన్‌ల ఏర్పాటుకు రూ.51 కోట్లు అవసరమని గుర్తించామని, అప్పటి వరకు లీకేజీ సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతిదేవి, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లు, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు, కార్పొరేషన్ ఈఈ కె.శ్రీనివాసరావు, డీఈ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం జిల్లా మంగళవారం నెల్లిమర్ల వాటర్ వర్క్స్

విజయనగరం జిల్లా మంగళవారం నెల్లిమర్ల వాటర్ వర్క్స్ ప్రాంతాలను నగర పాలక వర్గం సభ్యులు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పరిశీలించారు.

పౌష్టికాహారంతో గర్భిణులకు ఆరోగ్యం

- డీపీఎం బాలాజీ



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న బాలాజీ

విజయనగరం ఫోర్ట్: గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ అన్నారు. స్థానిక ఏఆర్‌టి కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లును మంగళవారం సాతి సంస్థ అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా వైద్య తనిఖీలు గర్భిణులు చేయించుకోవాలన్నారు. ప్రసవం అయ్యే వరకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. వైద్యుని సలహా లేకుండా ఎటువంటి మందులు వాడకూడదన్నారు. గర్భిణులు అందరు హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. హెచ్ఐవీ సోకిన వారు ఏఆర్‌టీ మందులు వాడాలని తెలిపారు. ఈ మందులు ప్రారంభించిన తర్వాత మధ్యలో మానివేయరాదని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ కేంద్రం సీనియర్ వైద్యాధికారి డాక్టర్ వరలక్ష్మి, డీఐసీ సాక్షి గోపాల్‌రావు, సాతి సంస్థ పీఓ సత్యనారాయణలు పాల్గొన్నారు.

అంధులు అవకాశాలు అందిపుచ్చుకోవాలి



అంధ, బధిర విద్యార్థులతో జేడీ లక్ష్మీనారాయణ

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

విజయనగరం: దేశంలో అంధులకి, బధిరులకి, దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అవకాశాలను కలిపిస్తున్నాయని వాటిని అందుకోవడానికి మనో నిబ్బరంతో సిద్ధంగా ఉండాలని సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. జేడీ ఫౌండేషన్ డెంకాడ మండలం డి.కొల్లాం ప్రతినిధులు కంటోన్మెంట్ గురజాడ పబ్లిక్ స్కూల్‌లో సారథి వెల్ఫేర్ అసోసియేషన్ అంధులకు మంగళవారం ఏర్పాటు చేసిన దుస్తులు, వంట సామాన్లు, పుస్తకాల వితరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా భారత మాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చూపులేదని చింత పడకుండా మనో నేత్రంతో సమాజంలోని రుగ్మతలను గుర్తించి అందరూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సారథి వెల్ఫేర్ అసోసియేషన్ విద్యార్థులకు తమ జేడీ ఫౌండేషన్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికులు ఉంగ ఆదినారాయణ, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి మజ్జి కృష్ణారావు, గురజాడ స్కూల్ కరస్పాండెంట్ స్వరూప పాల్గొన్నారు.

ఎయిడ్స్ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామేశ్వరి ప్రభు

- జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి రామేశ్వరిప్రభు

విజయనగరం ఫోర్ట్: ఎయిడ్స్ వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ జె.రామేశ్వరి ప్రభు అన్నారు. స్థానిక సబ్‌జైల్లో ఉన్న వారికి హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. హెచ్ఐవీ పట్ల అవగాహన కల్గి ఉండాలని తెలిపారు. హెచ్ఐవీ ఏవిధంగా వ్యాప్తి చెందుతుంది, రాకుండా ఏ జాగ్రత్తలు తీసుకోవాలి తెలుసుకోవాలని సూచించారు. హెచ్ఐవీ బాధితులు వ్యాధి సోకిందని బాధపడకుండా క్రమం తప్పకుండా ఏఆర్‌టీ మందులు వాడుతూ మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సాధారణ ప్రజల వలె ఆరోగ్యంగా జీవించవచ్చునని తెలిపారు. హెచ్ఐవీ రోగుల పట్ల వివక్ష చూపకూడదన్నారు. హెచ్ఐవీ అంటువ్యాధి కాదని చెప్పారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ టి.దుర్గారావు, డీపీఎం పి.బాలాజీ, డి.త్రినాథ్, ఎస్.మేనక పాల్గొన్నారు.

వైభవంగా మారువారాల సంబరాలు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



పోలమ్మతల్లి ఆలయం వద్ద భక్తుల పూజలు

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామంలో మారువారాల సంబరాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా కొత్తపోలమ్మ, పాతపోలమ్మ గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, కోళ్లు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

డీఎల్‌పీఓ పరిశీలన

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎం.బూర్జవలస గ్రామసచివాలయంలో గ్రామకంఠం, ప్రభుత్వ భూముల వివరాలను డీఎల్‌పీఓ(డివిజనల్ పంచాయతీ అధికారి) ఆరిశెట్టి మోహనరావు మంగళవారం పరిశీలించారు. మ్యాపు ఆధారంగా పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, ఎంపీడీఓ అల్లు భాస్కరరావులను అడిగి భూముల వివరాలపై ఆరాతీశారు. అనంతరం గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, చెత్త సేకరణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.



మ్యాపు ఆధారంగా భూముల వివరాలపై ఆరాతీస్తున్న డీఎల్‌పీఓ మోహనరావు

నిర్దేశిత లక్ష్య సాధనకు కృషి

బాడంగి: వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా 2022–23 ఏడాదికి సంబంధించి, నిర్దేశిత లక్ష్య సాధనకు కృషి చేస్తున్నామని వెలుగు కార్యాలయ ఏపీఎం పి.భాగ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 1,262 పొదుపు సంఘాలున్నాయని, వీటిలో 949 సంఘాలు బ్యాంకు లింకేజీకి అర్హత సాధించాయని పేర్కొన్నారు. వీరికి ఏప్రిల్‌లో రుణమాఫీ డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయన్నారు. స్త్రీనిధి ద్వారా ఈ ఏడాది మార్చి నెలాఖరుకు రూ.6.55 కోట్లు రుణ లక్ష్యం కాగా ఇప్పటివరకు 95 శాతం చేరువైనట్లు వెల్లడించారు. బ్యాంకు లింకేజీల ద్వారా రూ.28 కోట్ల రుణలక్ష్యం కాగా రూ.25 కోట్లు ఇప్పించినట్లు వివరించారు. పీఎస్ఈజీసీ కింద 23 యూనిట్లు నమోదు కాగా వీటిలో 10కి సంబంధించి, గ్రౌండింగ్ జరిగిందన్నారు. ఈ నెలాఖరులోగా మిగిలిన లక్ష్యాలు పూర్తి చేస్తామన్నారు.